# రుక్మిణీ సందేశం

తనికెళ్ళ కల్యాణి

''అమ్మా! మన రుక్మిణిని చూసుకోవడానికి ఈరోజు వైజాగ్‌వాళ్ళు వస్తున్నారుట. వాళ్ళు ఫోను చేసి చెప్పారు. సాయంత్రం ఆ ఏర్పాట్లు చూడండి.'' సుధాకర్ తల్లితో చెప్పాడు.

''పోనీలేరా! ఈ సంబంధం అయినా కుదిరి అది ఒక ఇంటిదైతే అంతేచాలు.'' రమణమ్మగారు కొడుకుతో అంటూ ఇంట్లోకి వచ్చారు.

''చూడు విశాలా! ఈరోజు పెళ్ళివారు రుక్మిణిని చూడటానికి వస్తున్నారట. టిఫిన్లు ఏం చేద్దాం!'' ఆవిడ కోడలుని అడిగారు.

''మనం ముందు ఆలోచించవలసింది టిఫిన్ల గురించి కాదు. సాయంత్రం మన కథానాయకురాలికి ఏ ప్రోగ్రాంలు లేకుండా చూడాలి.'' విశాల కొంత హాస్యంగా, కొంత నిష్ఠూరంగా అంది.

పనిమనిషి తోమిన గిన్నెలను మరొకమారు కడిగి ఇంట్లో పెడుతున్న రుక్మిణి ఛివాలున తల ఎత్తింది.

''అంటే ఏమిటి వదినా, నీ ఉద్దేశ్యం? కావాలని నేను తిరుగుతున్నానా? ఎప్పుడో ఏదో ఒకసారి స్నేహితురాలి పెళ్ళి ఉందని ఆరోజు పెళ్ళిచూపులకి కుదరదని కబురు పెట్టమన్నాను. ఎప్పుడూ అదే దెప్పుతారు.'' రుక్మిణి చిరాకుగా అంది.

''సరి సరి. మీ వదినా, ఆడపడుచుల పోట్లాట కాస్త కట్టిపెట్టండి.'' అంటూ సుధాకర్ రుక్మిణి దగ్గరికి వచ్చాడు. ''చూడు చిన్నా! ఈరోజు నువ్వు నేను చెప్పినట్లు వినాలి. ఎక్కువగా మాట్లాడకూడదు. నీకు ఎటువంటి ఇబ్బంది కలిగినా తర్వాత మనం మాట్లాడుకొందాం. వారి ఎదుట బాగా ఉండాలి. ఈ సంబంధం ఎంత మంచిదో తెలుసా? ఇది దాటిపోకూడదు.'' అంటూ చెల్లిని బ్రతిమాలాడాడు.

''ఏమిటో అన్నయ్యా! ఈ పెళ్ళిచూపులు, మీ ఆర్భాటాలూ. నాకేం కన్ను వంకరా? కాలు వంకరా? పెళ్ళే ఇంక కాదన్నట్లు అలాగ బ్రతిమాలతారేమిటి?'' రుక్మిణి తడి చేతులు తువ్వాలుకి


తుడుచుకొంటూ వెళ్ళిపోయింది.

విసురుగా ఆమె వెళ్ళడంతో బారెడు నల్లత్రాచు లాంటి జడ చివరలు వదినగారికి తగిలాయి.

''ఇదిగో చూడు తల్లీ! ఈవేళాకోళాలు మా తమ్ముడు వచ్చాక చెయ్యి'' వెనుక నుండి

రుక్మిణి చేతిలో వారపత్రిక ఉన్నా దృష్టి దానిమీద లేదు. ఏదో యాంత్రికంగా పేజీలు త్రిప్పుతోంది. అన్నగారు చెపుతున్న విషయాలపైనే దృష్టి వెళుతోంది.

ఇప్పటికి తనకి అయిదు పెళ్ళి సంబంధాలు వచ్చాయి. అన్నీ మంచివే. ఆమాటకి వస్తే




విశాల కవ్వింపుగా అంది.

రుక్మిణి ఆమాటలు తన చెవిలో పడనట్లు తన గదిలోకి వెళ్ళిపోయింది. సుధాకర్ తండ్రితో మిగిలిన విషయాలు మాట్లాడ సాగాడు.

తమ సంబంధం మాత్రం మంచిది కాదా? అలాగంటే అన్నయ్య తిడతాడుగాని.

అవి ఎందుకు కుదరలేదో తనకి అర్థమవలేదు. పెళ్ళిచూపులకంటూ రావడం, తాము పెట్టిన ఫలహారాలు హాయిగా తినడం,

వెళ్ళిన తర్వాత ఏదో ఒకటి వ్రాయడం.

అందుకే తనకి ఈ పెళ్ళిచూపులంటే చిరాకు. మా అబ్బాయి ఈఏడాది వివాహం చేసుకోడుట. మీరు మరొక సంబంధం చూసుకోండి'' అని ఒకరు వ్రాశారు.

ఏం పెళ్ళి చూపులకి వచ్చినపుడు ఆ విషయం తెలియదా? అలాంటప్పుడు ఎందుకు రావాలి?

మరొక పెళ్ళికొడుకు చూడటానికి వచ్చాడు. క్రికెట్ ఆట టీవీలో వస్తోంది. పెళ్ళివారు ఉన్నారని అన్నగారు టీవీ కట్టేశారు. పెళ్ళిచూపులైపోయాయి కదా అన్న ఉద్దేశ్యంతో తను ''అన్నయ్యా ఇండియా స్కోరు చూడు'' అంది.

అంతే. అన్నయ్యవైపు అదోలాగ నవ్వుతూ పెళ్ళికొడుకు చూసి ''మీ చెల్లికి క్రికెట్ అంటే ఇష్టమా'' అని అడిగాడు.

''ఏం ఆడపిల్ల అయినంత మాత్రాన ఇష్టాలు ఉండకూడదా? వాటిని బయటపడనీయ కూడదా?''

పెళ్ళికొడుకు తల్లి మధ్యవర్తితో ''మాకు ఆటపాటలు కావలసిన పిల్లకాదు. పనిపాటలు తెలిసిన పిల్లకావాలి.'' అని గొణిగిందిట. ఇంక అన్నయ్య కోపం చూడాలి.

''వరల్డ్‌కప్ పోటీలు అయినంత మాత్రాన అలాగ బయటపడి పోవాలా? అణకువ ఎప్పుడు వస్తుంది'' అంటూ లెక్చరిచ్చాడు. బాప్‌రే ఏం మనుష్యులు. ఇలాగే చిన్న విషయాలకే తేలిపోతే అలాంటివాళ్ళతో జీవితం పంచుకోవడం ఎంతకష్టం?

మరొక పెళ్ళికొడుకు ఇవతలవాళ్ళు ఏమను కుంటారోనన్న జంకయినా లేకుండా ''నేను ఇప్పుడప్పుడే పెళ్ళి వద్దనుకొన్నానండీ! మా అమ్మగారి బలవంతం వలన రావలసి వచ్చింది. ఆవిడ ఒక్కరూ పనిచేసుకోలేక అవస్థ పడుతున్నారు.'' అంటూ ఎంతో మాతృ విధేయుడిలాగ వంకరులు తిరిగిపోతూ అన్నాడు.

నాన్నగారు ఆ అబ్బాయివైపు తీక్షణంగా చూశారు. ఈరోజు అమ్మకోసం చేసుకొంటు న్నాడన్నారు. రేపు అమ్మకి ఇష్టం లేదంటే కాపురం చేయడం మానేసి భార్యను వదిలేస్తాడా?

తను ఉండబట్టలేక అదే అడిగింది. ఆ అబ్బాయి మొహం, తల్లి మొహం మాడి పోయాయి. కాకపోతే 'పెళ్ళి' అన్నది ఎంత మధురమైన వరం? జీవితంలో అదొక అపురూపమైన సంఘటన కావాలి. ఇద్దరి నిండు జీవితాలు పెనవేసికొనిపోయి జీవితాంతం సాగే ప్రయాణం కాదూ పెళ్ళంటే.

ఏ అనుభూతులూ లేకుండా అమ్మకోసం, నాన్నకోసం చేసుకొనే విషయమా పెళ్ళి? రుక్మిణి బరువుగా నిట్టూర్చింది.

''ఏవమ్మా పెళ్ళికూతురూ! అలాగ పడుకుంటే ఎలా? ఏ చీర కట్టుకొంటావో సెలక్టు చేసుకోవద్దా?'' వదిన వేళాకోళంగా నవ్వుతూ రుక్మిణి దగ్గరికి వచ్చింది.

''వదినా! చీర విషయానికేం కానీ ఒక్కమాట చెప్పు- పెళ్ళిచూపులకి వచ్చే వరుడు ఒక సదభిప్రాయంతో రావాలా వద్దా? ఊరికే వెళ్ళి వచ్చేందుకు ఇదేం సినిమాయా,

షికారా? ఈ పెళ్ళి చూపులంటేనే నాకు విసుగు వస్తోంది.'' రుక్మిణి ఆవేదనగా అంది.

విశాల ఏమీ మాట్లాడలేకపోయింది. రుక్మిణి ఆవేదన ఆమెకి బాగానే అర్థమవుతోంది.

పైకి మాత్రం నవ్వులాటగా తీసివేస్తూ అంది ''చూడూ తల్లీ! అలాగంటే నేనేం చెప్పను? ఆడపిల్ల అన్నాక ఇవన్నీ తప్పవు. వీటిని సీరియస్‌గా తీసుకోకూడదు. ఏదో నాఅదృష్టం బాగుండి మీ సంబంధం నాల్గవది అయింది. లేకపోతే ఇంకా ఎందరి ముందు నేను కూర్చోవలసి వచ్చేదో?'' విశాల అత్తవారి సహృదయతను గుర్తు చేసుకొంటూ అంది.

''మా నాన్నగారు ముందే అన్నయ్యకి చెప్పారు వదినా! ఒక మంచి భావనతో ఆ అమ్మాయిని చూడు. పెళ్ళి చేసికోదలచు కొన్నాననే ఆలోచనతో, సహచరిగా ఆమె అనుకూలమా అని చూడు. అంతేకానీ కాలక్షేపం కోసం అన్నట్లు వెళ్ళడం, వాళ్ళలో పదిలోపాలు వెదకడం మంచిపనికాదు. ఈ కాలంలో నాన్నగారి వంటివారు చాలా అరుదు.'' రుక్మిణి కళ్ళు తండ్రిని తలచుకోగానే గర్వంతో విశాలమయ్యాయి.

''బావుంది. మావయ్యగారి ముద్దుల కూతురివనే నిన్ను అత్తగారు, మీ అన్నయ్య ఏమీ అనలేకపోతున్నారు. ఈసారి తప్పక కుదిరిపోతుందిలే. పద. ఇల్లు సర్దుదాం.'' అంటూ రుక్మిణి జబ్బ పట్టుకొని లేపింది విశాల.

పెళ్ళిచూపులంటే రుక్మిణికి ఏం కంగారు లేదుకానీ రమణమ్మగారు మాత్రం ఒకటే కంగారు పడసాగారు. అక్కడికీ రాజారావు

## బిర్యానీ

అప్పారావ్ బిర్యానీ తింటూ సర్వర్‌ను పిలిచి ''ఏమిటయ్యా నిన్న బిర్యానీ చాలా బాగుంది. ఈవేళ ఏమిటి ఇలా వుంది?''

''భలేవారే సార్, అది నిన్నటిదే'' అన్నాడు సర్వర్.

- పి. రాధిక
(హంపసాగర)

గారు భార్యను దెబ్బలాడుతూనే ఉన్నారు.

''ఎందుకు రమణా హైరానాపడతావు? అమ్మాయికి వరుడు ఎక్కడో పుట్టే ఉన్నాడు. ఆ ఘడియ వస్తే తారసపడక తప్పదు కదా!''

రమణమ్మగారు ఆయన నిబ్బరం చూసి ముక్కున వేలేసుకొంటారు. ఈయనసలు ఆడపిల్లలని కన్న తండ్రేనా? అంత నిశ్చింత ఏమిటి అని ఆవిడ అభిప్రాయం.

అయినా పెద్దమ్మాయి శైలజ దారి వేరు. రుక్మిణి దారి వేరు. శైలజ అమాయకంగా, గంగిగోవులాగ ఉంటుంది. పెద్దల్లుడు లెక్చరర్. చూసిన మొదటి సంబంధమే పెద్దపిల్లకి కుదిరిపోయింది.

''అత్తయ్యా! మీరు హాల్లోకి వెళ్ళి వాళ్ళ దగ్గర కూర్చోండి. నేను మిగిలిన ఏర్పాట్లు చేస్తాను.'' విశాల మాటలతో ఆవిడ అలాగే నంటూ వచ్చినవాళ్ళను లోపలికి తీసికొని వచ్చి, వాళ్ళతో మాట్లాడుతూ కూర్చున్నారు.

విశాల లోపలకి రావడంతో, రుక్మిణి అన్నగారి పిలుపుకి బదులుగా వదినతోపాటు హాల్లోకి నడిచింది. సుధాకర్ చెల్లెలి గూర్చి వాళ్ళకి వివరాలు చెప్పసాగాడు.

రుక్మిణి మనసు భావరహితంగా ఉంది. ఎన్నిసార్లు ఈ పెళ్ళి పరీక్షకి సిద్ధపడాలి? ఏ రెండు మూడు ఇంటర్వ్యూలకో వెళితే ఉద్యోగమైనా దొరుకుతుందేమోకానీ పెళ్ళి సంబంధం ఎన్ని ఇంటర్వ్యూలైతే కుదురుతుందో ఎవరూ చెప్పలేరు. హాయిగా ఉద్యోగం చేసికూంటానంటే తల్లిదండ్రులు వినరుకదా!

''మీరేం మాట్లాడటంలేదు.'' పెళ్ళికొడుకు చెల్లి అడిగింది. రుక్మిణి ఈ లోకంలోకి వచ్చింది. ''ఏం మాట్లాడమంటారు?'' చిన్నగా నవ్వి అడిగింది.

''మీ హాబీస్ ఏమిటి? డిగ్రీతో చదువు ఎందుకు ఆపేశారు?'' మళ్ళీ ఆ అమ్మాయి అడిగింది.

''సంగీతం అంటే నాకు ప్రాణం. ఏకాస్త తీరిక సమయం దొరికినా సంగీతం వింటాను. మంచి పుస్తకాలు చదవడం అంటే ఎంతో ఇష్టం.'' రుక్మిణిలో బెరుకు పోవడంతో తన వయసే గల ఆ అమ్మాయితో సంభాషణలో పడింది.

పెళ్ళికొడుకు ఆసక్తిగా వారిద్దరి సంభాషణ వింటున్నాడు. డిగ్రీ ఫస్టుక్లాసులో పాసైనా పైచదువుకి తల్లిదండ్రులు అడ్డు చెప్పడం వలన ఊరుకున్నానని రుక్మిణి అనడంతో విజయ సానుభూతిగా చూసింది.

''అయితే ఇంక పైచదువు ప్రసక్తి లేనట్లేనా?'' విజయ కవ్వింపులాగ అడిగింది.

''ఏమో! అది నేను ఎలా చెప్పగలను? నా జీవిత భాగస్వామి నన్ను ప్రోత్సాహపరిస్తే తప్పక పైచదువు సాగిస్తాను.'' రుక్మిణి నిశ్చలమైన స్వరంతో బదులిచ్చింది.

పెళ్ళికొడుకు చూపులు రుక్మిణి చూపులతో కలిశాయి. పర్వాలేదు. అందగాడే. అనుకొంది రుక్మిణి.


''చదువు విషయాలకేంగానీ అమ్మాయి నీకు వంట, పనులు బాగా వచ్చునా?'' ఇంక ఉండబట్టలేక రుక్మిణిని నందగోపాల్ మేనత్త అడిగింది.

రుక్మిణి బదులుగా విశాల జవాబిచ్చింది. ఆవిడ ఇంకా ఏవో అడుగుతూనే ఉంది. నందగోపాల్ నెమ్మదిగా ''అత్తయ్యా! అన్ని పనులూ ముందే వచ్చి ఉండాలా? తర్వాత నేర్చుకోకూడదా?'' అని అడిగాడు.

అతడి మాటలకి ఆవిడ మనసులోనే ఉలిక్కిపడింది. పైకి మాత్రం నవ్వుతూ ''ఏరా! నందూ! నువ్వు పెద్దవాడివైపోయావురోయ్. అన్నయ్యా! నీ కొడుకునే ప్రశ్నలేవైనా అడగమను. మధ్యలో మనం ఎందుకు?'' అని అంది.

రుక్మిణి అతడి సహృదయతకి సంతోషించింది. ఆమె తండ్రి, అన్నీ అడగమని చెప్పినా అతడు ఏ ప్రశ్నలూ వేయలేదు. అతడి తండ్రి సుబ్బారావుగారు ఏవో తనకు తోచినవి అడిగారు. రుక్మిణి వినయంగానే సమాధానమిచ్చింది.

అందరూ వెళతామని లేచారు. విశాల, రమణమ్మగారు ఇల్లు చూపించడానికి వాళ్ళని తీసికెళ్ళారు. రుక్మిణి, విజయ, నందగోపాల్




హాలులో ఉండిపోయారు.

విజయ తన గదిని చూపించమని అడగ్గానే రుక్మిణి వాళ్ళని తీసికెళ్ళింది. నందగోపాల్‌కి వాళ్ళతో వెళ్ళాలో, మానాలో తెలియలేదు.

విజయే ''రా అన్నయ్యా!'' అనగానే మొహమాటంగా చూశాడు. రుక్మిణి కూడా నవ్వుతూ ''రండి'' అని పిలిచింది. అతడికి వెళ్ళక తప్పలేదు.

రుక్మిణి గది విజయకి ఎంతో నచ్చింది. అలమరనిండా పుస్తకాలు. అన్నీ పెద్ద పెద్ద రచయితలు వ్రాసినవే. టేబుల్ మీద టేప్ రికార్డర్. రాక్ నిండా కేసెట్లు. అన్నీ చూస్తూ ''మీలాగే మీగది కూడా చాలా బావుంది'' అని విజయ నవ్వుతూ అనేసింది.

''మీరిద్దరూ ఇక్కడ ఉండిపోయారేమిటర్రా?'' అంటూ నందగోపాల్ అత్తయ్య వచ్చారు.

బెదురు కాస్తయినా లేకుండా తమవాళ్ళతో కలిసి నవ్వుతూ మాట్లాడుతున్న రుక్మిణిని ఆవిడ నిశితంగా గమనించింది. ఈ అమ్మాయి ధైర్యం ఉన్న పిల్లే అనుకొంది.

అందరూ వస్తామని చెప్పి బయలుదేరారు. నందగోపాల్ సుధాకర్‌తో, వాళ్ళ నాన్నగారితో చెప్పి బయలుదేరాడు. విజయ మాత్రం రుక్మిణి చెయ్యి వెళ్ళే వరకూ వదలలేదు. టాక్సీ చివరగా ఎక్కేటప్పుడు నందగోపాల్ ఒకసారి రుక్మిణివైపు చూసి, వెంటనే తల త్రిప్పుకొన్నాడు. అక్కడికే చెల్లి ఎక్కడ తనని గమనిస్తుందో అని భయపడ్డాడు.

ఈ పెళ్ళి సంబంధం కుదురుతుందని అందరూ అనుకొన్నారు. అబ్బాయికి ఎల్ఐసిలో ఉద్యోగం, స్వంత ఇల్లు. తండ్రి, చెల్లి, అక్క ఉన్నారుట. అక్కా, బావ దూరంలో ఉండటం వలన రాలేదుట. మేనత్త ఊళ్ళోనే ఉండటంతో ఆవిడ అధికారం వాళ్ళ కుటుంబంలో ఎక్కువలాగే ఉంటుందనిపించింది.

కావాలనే నందగోపాల్ మేనత్త తెలిసిన స్నేహితుల ఇంటికి ఆ ఊళ్ళో వెళదామని పట్టుపట్టింది. పిల్ల తాలూకా మంచిచెడ్డలు

మధ్యవర్తుల వలననే తెలుస్తాయని ఆవిడ వాదన.

సుబ్బారావుగారికి ఆసమయంలో వెళ్ళడం ఇష్టం లేకపోయినా తప్పలేదు. సుదర్శనం ఆయన చిన్ననాటి మిత్రుడు. విషయం చెప్పగానే మంచి సంబంధమని చెప్పేశాడు. పోతే అమ్మాయి చాలా తెలివైనది, చురుకైనది. మా అమ్మాయికి సీనియర్ ఆపిల్ల అని చాలా విషయాలే చెప్పాడు. రుక్మిణికి ఆయన కూతురుకి బాగానే పరిచయం అవడం వాళ్ళకి అనుకూలించింది.

విజయకి రుక్మిణి చాలా నచ్చింది. ఆ అమ్మాయి తన అభిప్రాయం వెంటనే చెప్పేసింది. మేనత్తకి రుక్మిణి నచ్చలేదు. ఆడపిల్లనన్న బెదురు లేకుండా ఇప్పుడే అంత స్వతంత్రంగా ప్రవర్తించింది. రేపు తనని ఖాతరు చేస్తుందా?

''ఏమో అన్నయ్యా! మనవాడు గంగిగోవు లాంటివాడు. ఆ అమ్మాయి చూస్తే జాణలాగ ఉంది. నీకా ఆడదిక్కు లేదు. సంబంధం విషయంలో తొందరపడితే, ఆ తర్వాత మీరే బాధపడాలి.'' ఆవిడ అంత ఖచ్చితంగా అంటూంటే ఆయన ఏమీ అనలేకపోయారు.

పిల్లకాస్త చురుకైనదన్నమాట నిజమే. కానీ మంచిపిల్లే కన్పిస్తోంది అని ఆయన ఎటూ తేల్చుకోలేకపోయారు. నందగోపాల్‌కి వాళ్ళ మాటలు వింటూంటే ఏమనడానికీ మనస్కరించలేదు. తండ్రి బాధ్యత, ఇంటి బాధ్యత తనపై ఉండటంతో అతడు ఏరకంగానూ తన అభిప్రాయం వాళ్ళకి చెప్పలేకపోయాడు.

రుక్మిణి అందం, చురుకుదనం అతడిని ఆకర్షిస్తున్నాయి. అమ్మ ఉంటే బాగుండేది. అన్ని విషయాలూ ఆవిడే చూసుకొనేది అని బాధపడ్డాడు.

ఆరోజు ఆఫీసులో పనిచేస్తోంటే నంద గోపాల్‌కి ఎటెండర్ ఒక కవరు తెచ్చి ఇచ్చాడు. తనకి ఆఫీసు ఎడ్రస్‌కి ఉత్తరం... ఎవరు చెప్మా అని కుతూహలంగా కవరు చింపాడు.

గులాబీ రంగు కాగితంపై గుండ్రంటి, అందమైన అక్షరాలు... అతడు ఆశ్చర్యంగా ఉత్తరం చదవడం ప్రారంభించాడు. అతడికి తెలియకుండానే ఉత్తరం చదువుతోంటే అతడి పెదవులు చిరునవ్వుతో విచ్చుకొన్నాయి.

శ్రీ నందగోపాల్ గారికి,

రుక్మిణి నమస్కరించి వ్రాయునది. నేను ఎవరా అని ఆశ్చర్యపోవడం లేదుకదా! ఈమధ్యనే మన పెళ్ళిచూపులు జరిగాయి కదా! అందుకని గుర్తు ఉన్నాననుకొంటున్నాను.

నాకు మీరు బాగా నచ్చారు. ఒక ఆడపిల్ల ఇలాగ మొహమాటం, సిగ్గు లేకుండా చెప్పడం ఏమిటని ఆశ్చర్యపోతున్నారా? ఉన్న విషయాన్ని నిజాయితీగా ఒప్పుకోవడానికి మొహమాటం ఎందుకు చెప్పండి.

అయినా మీలో వంక పెట్టడానికి ఏం ఉంది? ఎల్.ఐ.సి. అసిస్టెంటుగా చక్కటి ఉద్యోగం, మంచి రూపం, అంతకంటే సుతిమెత్తని ప్రవర్తన ఇవన్నీ మీయందు నన్ను ఆకర్షించిన విషయాలే. పెళ్ళిచూపుల నాటి మీ ప్రవర్తన చాలు మీ గురించి అంచనా వేయడానికి. మెతుకు చూస్తే చాలదా అన్నం ఉడికిందో, లేదో చెప్పడానికి. అలాగ మీ సంస్కార యుతమైన ప్రవర్తన నాకు నచ్చింది.

నేనూ మీకు నచ్చానని నాకు అర్థమైంది. అయితే మీనుండి ఇంకా ఏ విషయం ఉత్తరం రాలేదని మావాళ్ళు అనుకొంటున్నారు. మీ ఆఫీసులోని ఫ్రెండ్స్ మా అన్నయ్యకి ఫ్రెండ్స్ కదా! శ్రీకాంత్‌గారు మీరు మా సంబంధం

విషయంలో పడుతున్న మీమాంస గురించి చెప్పారుట.

మీ మనసులోని శంకలు తొలగించవలసిన అవసరం ఉందని భావించి ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. ఇద్దరు ఇష్టమైన వాళ్ళు పెళ్ళి చేసుకోవడానికి మిగిలిన విషయాలు అడ్డు రాకూడదు కదూ! మిమ్మల్ని చేసుకొన్నాక మీ కుటుంబం నాదే అవుతుంది. దాని మంచి చెడ్డలు చూడవలసిన బాధ్యత నాకు ఉందని ఎలా మరిచిపోతాను? కుటుంబం వేరు, వ్యక్తులు వేరు కాదుకదా! కుటుంబం అంటే నాకు ఎంతో ప్రేమ, గౌరవం. అందుకే మావాళ్ళ మాటకి విలువనిచ్చి, వివాహానికి సుముఖత చూపించాను. పై చదువు అయినా మీరు ప్రోత్సాహం ఇస్తే, నా విధులు నిర్వహించాక కొనసాగిస్తాను. లేదూ ఈ జన్మకి ఇంతే ప్రాప్తమనుకొంటాను. అంతేగానీ నా కోరికల కోసం బాధ్యతలను ఎలా విస్మరిస్తాను.

మీకున్న బాధ్యతలు నాకు అర్థమయ్యాయి. వాటి విషయంలో నా సహకారం మీకు ఎప్పుడూ ఉంటుంది. ఇంక నా చురుకు దనమంటారా? దాన్ని భరించే సహృదయత మీలో నాకు కన్పించింది. కాస్త తెలివితేటలు, చురుకుదనం ఉన్నంత మాత్రంచేత ఆ అమ్మాయిల గురించి ఏవో ఊహించడం సమంజసం కాదనుకొంటాను. నాపట్ల మీకు నమ్మకం కలిగితే, మన సహజీవనం బాగుంటుందని మీకు అన్పిస్తే, త్వరలో ఒక నిర్ణయానికి వస్తారని ఆశిస్తాను.

ఇలాగ ఉత్తరం వ్రాయడానికి మీరే కారణం. నా మనసులోని మీరు తొంగి చూశారు కనుక వ్రాయడంలో తప్పులేదని నేను భావిస్తున్నాను. అయినా రుక్మిణీదేవికి అయితే అగ్నిద్యోత నుడు బ్రాహ్మణుడు ఉన్నాడు కనుక శ్రీకృష్ణునికి సందేశం పంపగలిగింది. మరి ఈ రుక్మిణికి ఈ ఉత్తరమే శరణ్యమైంది. నా మనసు విప్పి మీకు వ్రాశాను. అన్యథా భావించరు కదూ! విజయగారినడిగానని చెప్పండి. ఉంటాను.

మీ పెళ్ళిచూపుల కన్నె. రుక్మిణి.

పి.ఎస్:- ఈనాటి అమ్మాయిలకి ఈమాత్రం సాహసం అవసరం కదూ! అందుకే వ్రాస్తున్నా ఈ ఉత్తరం!

నందగోపాల్ ఉత్తరం మడిచి చూట్టూ చూశాడు. అందరూ వాళ్ళ పనులలో వాళ్ళు మునిగి ఉన్నారు. ఒక దేవకన్య మంచి గంధాన్ని తన సుకుమారమైన వేళ్ళతో చిలకరించినట్లు, సన్నజాజుల పరిమళంతో చల్లటిగాలి తనని తాకినట్లు అతడికి దివ్యమైన అనుభూతి కలిగింది. అతడు నెమ్మదిగా ఆ ఉత్తరాన్ని మడిచి సున్నితంగా పెదవులకి అన్చు కొన్నాడు.

''నాన్నగారూ!'' విజయ పిలుపుకి సుబ్బా రావుగారు పేపరులో నుండి తలపైకెత్తారు. ఎదురుగుండా విజయ నవ్వుతూ నిలబడింది. ఆ అమ్మాయికి కాస్త దూరంలో తల దువ్వుకొంటూ నందగోపాల్...

''అన్నయ్యకి రుక్మిణిగారు నచ్చారుట. ఎటువంటి సందేహాలు మీరు మనసులో పెట్టుకోకుండా వాళ్ళకి ఉత్తరం వ్రాయండి. మిగిలిన విషయాలు మాట్లాడుకొందుకి వాళ్ళని రమ్మనండి. చూశారా! నాకు నచ్చిన వదినే ఈ ఇంటికి వస్తోంది.'' విజయ మాటలకి ఆయన 'అవునా?' అన్నట్లు కొడుకువైపు చూశారు. కొడుకు చిరునవ్వు లోనే ఆయనకి సమాధానం దొరికింది. ★